సాక్షి
హనుమకొండ

మంగళవారం । 6 । జూన్ । 2023



నియంత్రృత్వాన్ని పెంచుతున్న బీజేపీ - 8లో▸

నియంత్రృత్వాన్ని బీజేపీ పెంచుతోందని ఎంసీపీఐ(యూ) జాతీయ నేత అశోక్ అన్నారు.



విద్యుత్ సబ్సిడీ రూ.50వేలకోట్లు

రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేల కోట్ల విద్యుత్ సబ్సిడీ చెల్లిస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
42^0 / 30^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

సివిల్స్ ర్యాంకర్లకు సీపీ సన్మానం



వరంగల్ క్రైం: ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన జిల్లాకు చెందిన రావుల జయసింహారెడ్డి, కె.రుత్విక్ సాయి, మంద అపూర్వను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భవిష్యత్‌లో నిరుపేద వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించాలన్నారు. సామాజికవేత్త ఈవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కలెక్టర్లను కలిసిన ర్యాంకర్లు..

హన్మకొండ అర్బన్/కరీమాబాద్: సివిల్స్ ర్యాంకర్లు శాకమూరి సాయి అశ్రిత్, మంద అపూర్వలు సోమవారం హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలను మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ర్యాంకర్లను సన్మానించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ శ్రీవత్స తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



వరంగల్ లీగల్ : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తిలు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టులో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి ప్రేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ల బాధ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు అవార్డు



ఎంజీఎం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ఉత్తమ పర్యావరణ సేవల అవార్డుకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎంపికైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సేవా పురస్కారాన్ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజేశ్ శర్మ, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు రజత్‌కుమార్ చేతుల మీదుగా చంద్రశేఖర్‌రెడ్డి అందుకున్నారు.

రేపు వాహనాల వేలం

కాజీపేట అర్బన్: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎల్.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన బొలెరో ట్రక్, ఆటో, సాంట్రో కారును ఉదయం 11 గంటలకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల అప్‌సెట్ ప్రైజ్‌లో 50శాతం డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

అడిషనల్ డీసీపీ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పీటీసీలో అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న పీవీ మురళీధర్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం చేపట్టిన పోలీస్ అధికారుల బదిలీల్లో భాగంగా మురళీధర్‌ను వికారాబాద్ పీటీసీకి అడిషనల్ ఎస్పీగా బదిలీ చేసింది.

వరంగల్ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దు

కాశిబుగ్గ : ఒడిశా బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాద నేపథ్యంలో వరంగల్ మీదుగా నడిచే పలు రైళ్లను మంగళవారం కూడా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 18045 షాలీమార్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ నుంచి షాలీమార్ వెళ్లే ఈస్ట్‌కోస్ట్, 22849 షాలీమార్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే సూపర్‌ఫాస్ట్, 22850 సికింద్రాబాద్ నుంచి షాలీమార్ వెళ్లే షాలీమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, 12773 షాలీమార్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే సికింద్రాబాద్ ఏసీ సూపర్‌ఫాస్ట్, అలాగే 12774 సికింద్రాబాద్ నుంచి షాలీమార్ వెళ్లే వీక్లీ ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు వివరించారు.

పారిశ్రామిక ప్రగతి పరుగులు!

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పెరిగిన పరిశ్రమలు

- ఉమ్మడి వరంగల్‌కు భారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- 1,825 పరిశ్రమలు.. కొత్తవాటిపై సాగుతున్న కసరత్తు
- రూ.5,960 కోట్ల పెట్టుబడులు.. 2.08 లక్షల మందికి ఉపాధి
- దశాబ్ది వేడుకల్లో నేడు పారిశ్రామిక ప్రగతి దినోత్సవం



సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన ఉమ్మడి వరంగల్ ఇప్పుడు పారిశ్రామిక రంగంలో పరుగులు తీస్తోంది. గత ప్రభుత్వాలకు అసాధ్యమైన అభివృద్ధిని చేసి చూపించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు పారిశ్రామిక ఎదగడానికి అనేక వనరులున్నా.. ఈ ప్రాంతంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఫలితంగా వేలాది మంది ముంబయి, దుబాయి, భీవండి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాలతో పాటు పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏర్పడి వలసలు ఆగిపోయాయి. తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రగతి దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక రంగంపై కథనం.

పారిశ్రామిక ప్రస్థానం..

అజాంజాహి, బిల్టు తదితర పరిశ్రమల మూసివేత తర్వాత ఉద్యోగులు రోడ్డున పడడమే కాకుండా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. అప్పటి ప్రభుత్వాలు వీటిని తెరిపించే ప్రయత్నం చేయకపోగా.. చేపట్టిన ప్రత్యామ్నాయ మార్గాలు ఆశాజనకం అనిపించక వలసలు పెరిగాయి. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉమ్మడి వరంగల్‌లో టీఎస్-ఐపాస్ ద్వారా 1,825 పరిశ్రమల స్థాపన జరిగినట్లు ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. సుమారు రూ.5,960 కోట్ల పెట్టుబడులు రాగా, 2,08,328 మందికి 1,825 పరిశ్రమల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆగమనంలో ఐటీ పరిశ్రమలు..

ఇప్పటికే ఓరుగల్లు ఐటీ పార్క్‌లో సైయింట్ టెక్, టెక్ మహేంద్ర, సాఫ్ట్‌పాత్, క్వాడ్రంట్ రిసోర్సెస్ వంటి సంస్థలు తమ బ్రాంచీలను ఏర్పాటు చేశాయి. త్వరలోనే జెన్‌ప్యాక్ట్, హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్, హెక్సాడ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఐటీ కంపెనీలు తమ సంస్థలను ఏర్పాటు చేయనున్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే ఈ కంపెనీల బ్రాంచీల ద్వారా వరంగల్‌కు రెండు వేలకు పైగా కొత్త ఉద్యోగాలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతానికి చెందిన చాలా మంది యువకులకు సొంతూరులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే అవకాశం దక్కనుంది. అమెరికాలోని హ్యూస్టన్‌కి చెందిన టెక్‌వేవ్ సంస్థ వచ్చే ఏడాదిలో ఖమ్మంతోపాటు వరంగల్‌లో బ్రాంచీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కొత్తగా వచ్చే కంపెనీలతో కలుపుకుని ఉద్యోగుల సంఖ్య 2,500 నుంచి 3,000మంది వరకు ఉంటుందని అంచనా.

కాకతీయ టెక్స్‌టైల్ పార్క్

వరంగల్ జిల్లా గీసుకొండ పరిధిలోని కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో ఒక్కో కంపెనీ ప్రారంభమవుతోంది. ఇప్పటికే గణేశ ఎకోటెక్స్ కంపెనీ ఏర్పాటు చేశారు. ఇందులో 400 మంది దాకా పనిచేస్తున్నారు. కేరళకు చెందిన కైటెక్స్ కంపెనీ అండర్ కన్‌స్ట్రక్షన్‌లో ఉంది. ఇది ప్రారంభమైతే 4వేలమంది మహిళలకు ఉపాధి లభించనుంది. దక్షిణకొరియాకు చెందిన ఎంగాన్ అనే కంపెనీకి భూమి కేటాయించారు. పనులు ప్రారంభించాల్సి ఉంది.

పారిశ్రామికంగా ఇలా..

- వరంగల్ జిల్లాలో అత్యధికంగా 1,90,884 మందికి ఉద్యోగ, ఉపాధి లభించగా, అత్యల్పంగా ములుగు జిల్లాలో రూ.41 కోట్లతో ఏర్పాటైన 57 పరిశ్రమల ద్వారా 466 మందికి ఉపాధి లభించింది.
- హనుమకొండలో రూ.670 కోట్లతో స్థాపించిన 650 యూనిట్ల కింద 7,615 మందికి ఉద్యోగాల కల్పన చేశారు.
- జేఎస్ భూపాలపల్లి జిల్లాలో 123 పరిశ్రమల ద్వారా 1,834 మందికి ఉపాధి లభించింది.
- మహబూబాబాద్‌లో 361 యూనిట్ల ద్వారా 3,496మందికి ఉద్యోగాలు వచ్చాయి.
- జనగామలో 274ల ద్వారా 4,033 మందికి ఉపాధి లభించింది.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థల ఏర్పాటు విషయంలో 7,972 యూనిట్లతో హనుమకొండ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.
- వరంగల్‌లో 3,099, మహబూబాబాద్‌లో 2,463, జనగామలో 1,730, జేఎస్ భూపాలపల్లిలో 1,352, ములుగులో 497 యూనిట్లు ఏర్పడ్డాయి.

అభివృద్ధి పథంలో ఐటీ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐటీ సంస్థ అభివృద్ధి పథంలో ఉంది. మడికొండలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటయ్యాక టెక్ మహేంద్ర, సైయింట్, జెన్‌ప్యాక్ట్ వంటి అనేక ఐటీ సంస్థలు వచ్చాయి. ముఖ్యంగా మరిన్ని సెంటర్లు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద నగరంగా వరంగల్ అభివృద్ధిలో ఉంది.

\- సంతోష్, ఇండస్ట్రియల్ ఏరియా జోనల్ మేనేజర్

ప్రకృతిపై గ్రామీణులకు మమకారం ఎక్కువ

డీఎఫ్‌ఓ వసంత



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ వసంత

ధర్మసాగర్: ప్రకృతి పట్ల గ్రామీణ ప్రజలకు ఉన్న మమకారమే పర్యావరణకు రక్షణ కవచమని జిల్లా అటవీశాఖ అధికారి వసంత అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, జన విజ్ఞాన వేదిక, వన సేవా సొసైటీ సంస్థల సహకారంతో సోమవారం ధర్మసాగర్ మండలంలోని దేవునూర్ ఇనుపరాతి గట్లవద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ వసంత మాట్లాడుతూ 50 ఏళ్లుగా ప్రభుత్వం దేవునూర్ ఇనుపరాతి గట్లను రక్షిత అటవీ ప్రాంతంగా ప్రకటించకపోయినప్పటికీ సమీప గ్రామీణ ప్రజలు ప్రకృతి పట్ల ఉన్న మమకారంతో కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారన్నారు. త్వరలో ఈ ప్రాంతం సర్వే చేయించి రక్షిత అటవీప్రాంతంగా ప్రకటించడానికి ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ పర్యావరణ విభాగం కోఆర్డినేటర్ పిట్టల రవిబాబు మాట్లాడుతూ ఈ ఇనుపరాతి గట్లు జీవవైవిధ్యానికి నిలయమని, అరుదైన ఔషధ మొక్కలు ఈ ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. అనంతరం జన విజ్ఞాన వేదిక రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. దేవునూర్ గ్రామ సర్పంచ్ చిర్ర కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశ్రాంత అటవీశాఖ అధికారి కాజీపేట పురుషోత్తం, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, ఐఎఫ్ఎస్ అధికారి కిష్టగౌడ్, కమలాకర్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం సభ్యులు సంతోష్, జన విజ్ఞాన వేదిక సభ్యుడు రాములు, ఉమామహేశ్వర్, రామారావు, శ్రీనివాస్, ఎర్రబెల్లి ఉప సర్పంచ్ అల్లం సీష్, దేవునూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రగతిపై విస్తృత ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు

హన్మకొండ: విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో విద్యుత్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావుతో కలిసి చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే అంధకారమే అని హేళన చేశారని, వాటన్నింటిని పటాపంచలు చేస్తూ నేడు కోత లేకుండా అన్ని వర్గాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ఆనాటి అహంకారపు మాటలు, అంధకారం నుంచి నేడు తెలంగాణలో వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు మాట్లాడుతూ టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో సాధించిన ప్రగతిని వివరించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ 9 ఏళ్ల తెలంగాణలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, డీఈలు విజేందర్‌రెడ్డి, దర్శన్, ఏడీఈలు సుబ్రహ్మణ్యం, మల్లికార్జున్, కిషన్, ఏఈలు, విద్యుత్ ఉద్యోగులు, వృత్తి సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.

11న 'తెలంగాణ సాహిత్య దినోత్సవం'

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



కమిటీ సభ్యులు, కవులతో సమావేశమైన కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న 'తెలంగాణ సాహిత్య దినోత్సవం' వేడుకల్లో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కార్యక్రమ కమిటీ సభ్యులు, కవులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని కాకతీయ హోటల్‌లో జరిగే ఈ కవిసమ్మేళనంలో జిల్లాకు చెందిన ఉర్దూ, తెలుగు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. 20 పంక్తులు నుంచి గరిష్టంగా 26 పంక్తులు మించకుండా కవితలు, రచనలు ఉండేలా చూడాలన్నారు. 'తెలంగాణ అస్తిత్వం – తెలంగాణ ప్రగతి ' అనే అంశంతో కవితలు ఉండాలని సూచించారు. ఆసక్తి గల కవులు వారి కవితలను ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు తమ పేరు, చిరునామా, మొబైల్ నంబర్‌తో సహా 98494 59667కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కేవలం ఒక కవితను మాత్రమే పంపించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు, కవులు ప్రొఫెసర్ బన్న అయిలయ్య, వీఆర్ విద్యార్థి, అనిశెట్టి రజిత, పొట్లపల్లి శ్రీనివాసరావు, మహ్మద్ సిరాజుద్దీన్, వల్సపైడి, అస్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



వినతులు స్వీకరిస్తున్న సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజలనుంచి వివిధ రకాల సమస్యలపై స్వీకరించిన వినతులను అయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి.. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆమె ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ 20, ఆర్డీఓ హనుమకొండ 05, కలెక్టరేట్ డీ సెక్షన్ 05, తహసీల్దార్ కమలాపూర్ 04లతోపాటు మొత్తం 74 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జగదీశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, కలెక్టరేట్ ఏఓ కిరణ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

పర్యావరణహితం అందరి అభిమతం కావాలి

బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: పర్యావరణహితం అందరి అభిమతం కావాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆకాంక్షించారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం రెడ్యూస్, రీ-యూజ్, రీ-సైకిల్ ప్రధాన అంశంగా అన్ని డివిజన్లలో 3-ఆర్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని కోరారు. 3-ఆర్ కేంద్రాల ద్వారా ఎక్కువ మొత్తంలో వస్తువులను సేకరించిన సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి సిద్ధం

- కర్నూలు, కడప జిల్లాల నుంచి గొర్రెల తరలింపు
- దశాబ్ది ఉత్సవాల్లో 9న పంపిణీకి ఏర్పాట్లు
- ఎంపిక, కొనుగోలుకు వెళ్లిన లబ్ధిదారులు
- హనుమకొండ, దామెరలో 24 యూనిట్ల చొప్పున పంపిణీ
- నగర పరిధిలోనూ పథకం అమలు



హన్మకొండ: రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో వీటిని పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. హనుమకొండ, దామెరలో 24 యూనిట్ల చొప్పున 48 యూనిట్ల గొర్రెలను ఈ నెల 9న లబ్ధిదారులకు అందించనున్నారు. ఏయే జిల్లాకు ఎక్కడినుంచి గొర్రెలు తరలించాలో నిర్ణయం తీసుకున్నారు. హనుమకొండ జిల్లా లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, కడప జిల్లాలతోపాటు కర్ణాటకలోని బళ్లారిని కేటాయించారు. ఈసారి మాత్రం కర్నూలు, కడప నుంచి గొర్రెలు కొనుగోలు చేస్తున్నారు. ఈ మేరకు గొర్రెలు ఎంపిక చేసుకుని తీసుకురావడానికి లబ్ధిదారులు అధికారులతో కలిసి సోమవారం కర్నూలు, కడపకు వెళ్లారు.

ప్రత్యేక అధికారుల నియామకం

లబ్ధిదారులు గొర్రెలు ఎంపిక చేసుకున్న అనంతరం వాటికి ఇన్సూరెన్స్ చేయడం.. ఇతర తరలింపునకు చర్యలు చేపట్టేందుకు జిల్లాకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. హనుమకొండ జిల్లాకు వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట సహాయ సంచాలకుడు యాకూబ్‌రెడ్డి, నర్సంపేట సహాయ సంచాలకుడు బీఎస్.రెడ్డిని ప్రత్యేక అధికారులుగా నిర్ణయించారు. జిల్లా క్రీడా, యువజన అధికారి అశోక్, డీఆర్‌డీఏ ఏపీడీ రవిని జిల్లా ప్రొక్యూర్‌మెంట్ టీమ్‌గా కలెక్టర్ సిక్తా పట్నాయక్ నియమించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి జిల్లా క్రీడా యువజన అధికారి అశోక్, నర్సంపేట ఏడీ బి.నర్సింహారెడ్డి, పరకాల నియోజకవర్గానికి డీఆర్‌డీఏ ఏపీడీ రవి, వర్ధన్నపేట ఏడీ యాకూబ్‌రెడ్డి టీమ్‌లో సభ్యులుగా ఉంటారు. వీరు లబ్ధిదారులతో కలిసి వెళ్లారు.

జిల్లాలో 179 సహకార సంఘాలు..

హనుమకొండ జిల్లాలో 179 గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాలున్నాయి. ఇందులో ఏ గ్రూపులో 8,409, బీ గ్రూపులో 8,518 యూనిట్లుగా విభజించారు. పథకం ప్రారంభంలో నగర ప్రాంతాన్ని చేర్చలేదు. అ తర్వాత నగరంలోని గొర్రెలు, మేకలపెంపకందారుల నుంచి ఒత్తిడి రావడంతోపాటు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో రెండో విడతలో నగర ప్రాంతాన్ని చేర్చారు. హనుమకొండ జిల్లాలో నగర ప్రాంతంలోని 4,108 యూనిట్లు రెండో విడతలో చేర్చారు. దీంతో జిల్లాలో రెండో విడత 12,626 యూనిట్లకు చేరింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా 5,444 యూనిట్లకు గొర్రెలు పంపిణీ చేశారు. అదే విధంగా మొదటి విడతలో 8,409 యూనిట్లకుగాను 8,273 యూనిట్లు పంపిణీ చేయగా 136 యూనిట్లు మిగిలిపోయాయి. మొదటి, రెండో విడతల్లో మిగిలిపోయిన వాటితోపాటు నగర ప్రాంతంలోని యూనిట్లు కలుపుకుని ప్రస్తుతం వీటి సంఖ్య 7,318కి చేరింది. వీరిలో మొదటగా ఈ నెల 9న 48 యూనిట్లను లబ్ధిదారులకు అందిస్తారు.

పంపిణీకి సన్నద్ధం

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి సిద్ధమయ్యాం. గొర్రెల కొనుగోలుకు లబ్ధిదారులు వెళ్లారు. ఈ నెల 9న వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో హనుమకొండ, పరకాల నియోజకవర్గంలో దామెరలో 24 యూనిట్ల చొప్పున గొర్రెలు పంపిణీ చేసేందుకు కలెక్టర్ అన్ని చర్యలు తీసుకున్నారు. పూర్తి పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ జరుగుతుంది.

డాక్టర్ వెంకటనారాయణ, జిల్లా పశువైద్యాధికారి

జిల్లా పరిధిలో మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు..

మండలం	లబ్ధిదారుల సంఖ్య		పంపిణీ జరిగింది		పంపిణీ చేయాల్సినవి		
	లిస్ట్-ఏ	లిస్ట్-బీ	లిస్ట్-ఏ	లిస్ట్-బీ	లిస్ట్-ఏ	లిస్ట్-బీ	మొత్తం
ఆత్మకూర్	664	663	664	273	-	390	390
శాయంపేట	437	435	872	437	-	435	435
దామెర	656	653	656	-	-	653	653
నడికుడ	573	570	568	-	5	570	575
పరకాల	434	432	432	-	2	432	434
భీమదేవరపల్లి	1106	1,116	1,036	1,005	70	111	181
ఎల్కతుర్తి	714	706	693	683	21	23	44
కమలాపూర్	1,141	1,136	1,137	1,119	4	17	21
వేలేరు	657	657	654	588	3	69	72
ధర్మసాగర్	790	1012	773	634	17	378	395
హసన్‌పర్తి	347	1747	341	324	6	1423	1,429
ఐనవోలు	890	965	882	812	8	153	161
కాజీపేట	-	1994	-	6	-	1,988	1,988
హనుమకొండ	-	540	-	-	-	540	540

మెడికో మానసకు కన్నీటి వీడ్కోలు

- పోచమ్మకుంట శ్మశానవాటికలో దహనసంస్కారాలు
- తలకొరివి పెట్టిన చిన్నమ్మ ప్రణతి



మానస మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నమ్మ ప్రణతి, బంధువులు

నయీంనగర్: మెడికో సముద్రాల మానసకు బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న వైద్య విద్యార్థిని మానస మృతదేహానికి సోమవారం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేశాక వరంగల్ నగరానికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలు మధ్య హనుమకొండ పోచమ్మకుంట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అవివాహితురాలైన మానసకు మొదట జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించి సంప్రదాయ పద్ధతిలో చిన్నమ్మ ప్రణతి అంతిమ సంస్కారం నిర్వహించి తలకొరివి పెట్టారు.

మొదట తల్లి.. ఆ తరువాత తండ్రి మరణం..

వరంగల్ నగరంలోని గిర్మాజీపేటకు చెందిన సముద్రాల అజయ్– ప్రశాంతి దంపతుల కూతురు మానస. మానస చిన్నప్పుడే తల్లి ప్రశాంతి చనిపోయింది. దీంతో అజయ్ ఆమె చెల్లెలు ప్రణతిని పెళ్లి చేసుకున్నాడు. వారికి ఒక పాప ఉన్నారు. ఆమె ఇప్పుడు బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. సముద్రాల అజయ్ రేషన్ డీలర్ కాగా, ఇతని నాన్న సముద్రాల మధుసూదన్ కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్‌గా పనిచేశారు. ప్రణతి ఎల్కతుర్తి మండలం, దండేపల్లిలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. 2008లో అజయ్ కూడా చనిపోయాడు. దీంతో ఇద్దరు అమ్మాయిలను ప్రణతినే పెంచుతున్నారు. వీరు 20 ఏళ్లుగా వరంగల్ ఎల్లంబజార్‌లో ఉండగా గత ఏడాదినుంచి ప్రణతి ఉద్యోగం, కూతురు చదువు నిమిత్తం 52వ డివిజన్ బాపూజీ స్కూల్ వద్ద నివాసం ఉంటున్నారు.

మానస తెలివైన స్టూడెంట్

దహన సంస్కారాలకు మానస పదవ తరగతి రిషి స్కూల్ మిత్రులు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానస తెలివైన విద్యార్థి అని, తమకు ఆమె నుంచి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో తెలియడం లేదని చెప్పారు.

మూడేళ్లు కలిసి చదువుకుని ఒక్కరు కూడా రారా..

మానస తండ్రి అజయ్ మిత్రుడు క్రిష్ణ మాట్లాడుతూ ఇలా జరగడం చాలా బాధాకరమన్నారు. సెల్‌ఫోన్ ఎవరు, ఎందుకు దాచి పెట్టారని ప్రశ్నించారు. గ్రామంలో తెలిసిన వాళ్లు చనిపోతే చూసేందుకు వెళ్తాం.. కానీ మూడేళ్లనుంచి కాలేజీలో చదువుకుంటున్న స్నేహితురాలు చనిపోతే తోటి స్నేహితులు ఒక్కరు కూడా రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి వారు చదివి ఏం ఉద్ధరిస్తారని అక్కడున్న వారు అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఏపీజీవీబీ చైర్మన్‌గా ప్రతాపరెడ్డి



హన్మకొండ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి బ్యాంకు చైర్మన్‌గా కె.ప్రతాపరెడ్డి నియమితులయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కె.ప్రతాపరెడ్డిని ఏపీజీవీబీ చైర్మన్‌గా యాజమాన్య సంస్థ ఎస్‌బీఐ నియమించగా సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రతాపరెడ్డి రెండు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. పరిపాలన రంగంలో విశేష నైపుణ్యాన్ని కలిగి ఉన్నారు. ఐదేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగుతారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



గౌరయ్య (ఫైల్)

నర్సింహులపేట: మండల కేంద్రానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు బొల్లం గౌరయ్య (99) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ గౌరయ్య పార్థివదేహాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గౌరయ్య మృతిపై ఆర్యవైశ్య సంఘం నాయకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

సంతానం కలగడం లేదని వివాహిత ఆత్మహత్య

ఐనవోలు: వివాహమై పదేళ్లు అయినప్పటికీ సంతానం కలగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని పంథినిలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. పంథిని గ్రామానికి చెందిన సమ్మెట శ్రీనివాస్‌కు భూపాలపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామానికి చెందిన రజిత(39)తో పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహమై పది సంవత్సరాలైనప్పటికీ సంతానం కలగకపోవడంతో బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు వెళ్లడానికి ఇబ్బంది పడేది. ఈ విషయంపై తరచూ కలత చెందుతూ ఉండేది. ఈ క్రమంలో తీవ్రంగా మనస్తాపానికి గురైన రజిత శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన చుట్టుప్రక్కల వారు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తమ్ముడు మద్యల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ములుగుకు ఐటీ మంత్రి కేటీఆర్

- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసిన కలెక్టర్, ఎస్పీ



సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్

ములుగు: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బుధవారం ములుగు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ పనులను పరిశీలించారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా సభ నిర్వహణపై అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలపై ఆరా తీశారు. కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఎస్పీ గాష్ ఆలం దగ్గరుండి పనులను పరిశీలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా ఎస్పీ సోమవారం ఉదయం సమీకృత కలెక్టరేట్ భవనానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి కేటీఆర్ ములుగు వచ్చి తిరిగి వెళ్లేంత వరకు భద్రతను కొనసాగించనున్నారు.

షెడ్యూల్ ఇలా

బుధవారం ఉదయం 9.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి చాపర్‌లో బయలుదేరుతారు. 10.15 నిమిషాలకు బండారుపల్లి పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుంటారు. రూ. 65 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. 10.40 నిమిషాలకు రూ.కోటి 25 లక్షలతో నిర్మించనున్న ఆర్టీసీ మోడల్ మినీ బస్టాండ్, రూ.50 లక్షలతో నిర్మించనున్న సేవాలాల్ భవన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి ములుగు మండలం మాధవరావుపల్లి సమీపంలో నిర్మించిన శ్మశాన వాటికను ప్రారంభిస్తారు. 11 గంటలకు రూ. 30 లక్షలతో ఏర్పాటు చేయనున్న డిజిటల్ లైబ్రరీ, రూ. 50 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఐ అండ్ పీఆర్ సమావేశ మందిరానికి శంకుస్థాపన చేస్తారు. ములుగు నుంచి ప్రత్యేక వాహనంలో రామప్పకు చేరుకొని 11.30 నిమిషాలకు ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామప్ప చెరువును సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.20 నిమిషాలకు జిల్లా కేంద్రంలోని సాధన హైస్కూల్ సమీపంలో ఏర్పాటు చేయనున్న సభకు చేరుకొని ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు చాపర్ ద్వారా హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

అధికారులతో సమీక్ష

కేటీఆర్ కార్యాక్రమంలో భాగంగా ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మంత్రి సత్యవతిరాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత పరిశీలించారు. హెలీపాడ్ నుంచి నూతన కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంపై ఆరా తీశారు. మంత్రి కేటీఆర్ వచ్చి తిరుగు పయనమయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. మంత్రి సత్యవతి రాథోడ్ ములుగు జీపీ పరిధిలోని మాధవరావుపల్లి శ్మశానవాటికను జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ నాగేందర్, ఈఈ వెంకటేశ్, ఇరిగేషన్ ఎస్‌ఈ విజయభాస్కర్‌లతో కలిసి పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, జెడ్పీటీసీలు సకినాల భవాని, గైరుద్రమాదేవి, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్, తహసీల్దార్లు మధురకవి సత్యనారాయణస్వామి, మంజూల, ఎంపీడీఓ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సమీక్ష

- సస్పెండైన వారికి పనులు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించిన సీనియర్ నాయకులు



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

ఈ నెల 7న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. మండలానికి 2 వేల మందిని తరలించి మంత్రి కేటీఆర్ టూర్‌ను సక్సెస్ చేయాలని మంత్రులు చెబుతున్న తరుణంలో ఏటూరునాగారం చెందిన పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి ఒక్కసారిగా అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ కవితను మెజారిటీతో గెలిపిస్తే ఏటూరునాగారం మండలానికి ఏం చేశారని ప్రశ్నించారు. పార్టీలో మాకు విలువ లేకుండా చేశారని ప్రజల్లోకి వెళితే ప్రశ్నిస్తున్నారని ములుగు మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్ వాపోయారు. పార్టీ నుంచి సస్పెండైన రియాజ్ మీర్జాకు రోడ్డు కాంట్రాక్ట్ పనులు ఏ విధంగా అప్పగిస్తారని నాయకులు ప్రశ్నించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు గ్రూప్ రాజకీయాలు చేస్తూ కార్యకర్తలను బలి చేస్తున్నారని ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ కోసం గొడవలు పెట్టుకోవద్దని సీఎం కేసీఆర్ నేరుగా సర్వేలు చేపడుతున్నారన్నారు. ముందు మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నెల 24 లేదా 26 తేదీల్లో నాయకులను హైదరాబాద్ తీసుకువెళ్లి మంత్రి కేటీఆర్‌ను కల్పిస్తామని అన్నారు. ఆరునెలల క్రితం ఏటూరునాగారంకు సీ ఎం కేసీఆర్ వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే సీతక్క నన్నే నెట్టుకుంటూ ముందుకు పోయిందని గుర్తుచేశారు. ఆమెకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించింది నేనేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి చూపిస్తానని ఎర్రబెల్లి అన్నారు. ఇటీవలే సీతక్క విషయమై సీఎం కేసీఆర్ వద్ద చర్చించానని అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఏకతాటిపైకి రావాలని కోరారు. దీంతో కార్యకర్తలు, నాయకులు వెనుకడుగు వేశారు.

విద్యుత్‌పై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: రాష్ట్ర అభివృద్ధి విద్యుత్ పైనే ఆధారపడుతుందని భావించి ఈ రంగం అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ.అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. విద్యుత్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు తెలంగాణ వచ్చిన తర్వాత విద్యుత్ రంగంలో వచ్చిన మార్పులు సాధించిన ప్రగతిని వివరించారు. సీఎం కేసీఆర్ విద్యుత్ రంగంపై దృష్టిసారించి తొమ్మిదేళ్లలో కేటీపీపీ 600 మెగావాట్లు, దిగువ జూరాల 240, పులిచింతల 120, కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్ 300, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 1080 మెగావాట్లు ప్రారంభించారని వివరించారు. వీటితో పాటు కేటీపీఎస్ 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.మోహన్‌రెడ్డి,వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. జనార్దన్, కార్యదర్శి కె.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ రమేష్, పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం

మడికొండ: కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తరాలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన దూదిమెట్ల వెంకటమ్మ(80) తన కుమారుడు రమేష్ వద్ద ఉంటుంది. ఆదివారం రాత్రి భోజనం చేసి పడుకుంది. రమేష్ సోమవారం ఉదయం పశువుల పాలు పితికేందుకు లేచి చూసే సరికి వెంకటమ్మ మంచంలో కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికాడు. తన అన్న వెంకటయ్యకు సమాచారం అందించాడు. ఆచూకీ కోసం వెతుకుతుండగా వారి వ్యవసాయ బావి వద్ద వెంకటమ్మ చేతి కర్ర లభించడంతో బావిలో చూశారు. బావిలో శవమై ఉంది. దీంతో పోలీసులకు సమచారం అందించగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. వెంకటమ్మకు కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేదన్నారు. ఆదివారం రాత్రి కడుపునొప్పి తీవ్రం కావడంతో వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై నర్సింగరావు తెలిపారు.

విద్యుత్ సబ్సిడీ సహకారం రూ.50 వేల కోట్లు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: రాష్ట్రంలో 27 లక్షల 10 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా రైతుల తరఫున పలు రకాల సబ్సిడీగా రూ.50 వేల కోట్లు కేసీఆర్ ప్రభుత్వం చెల్లిస్తుందని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యుత్ సమస్యల సాధనపై ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. విద్యుత్ లోపంతో ఎన్నో రకాల సమస్యల కోసం సతమతమవుతున్న ప్రజలకు సీఎం కేసీఆర్ సమస్యలను తీర్చినట్లు మంత్రి ఎర్రబెల్లి అన్నారు. గత పాలనలో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి 9 ఏళ్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వంద శాతం సరఫరా చేస్తున్నారన్నారు. గతంలో కేవలం రూ. 49 వేల కోట్లు మాత్రమే చెల్లించగా నేడు రూ. 883 కోట్లు సబ్సిడీగా చెల్లిస్తుందని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో 87,980 మంది రైతులకు రూ.880 కోట్లు 4 లక్షలు సబ్సిడీగా చెల్లిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో వృత్తిదారులు రజకులు, నాయీబ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీలకు పూర్తి స్థాయిలో సబ్సిడీని అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోనే విద్యుత్ ఉత్పత్తిని చేయడం జరుగుతుందని అన్నారు. సదస్సులో పాల్గొనేందుకు తరలివస్తున్న మంత్రికి, కలెక్టర్ శివలింగయ్యలకు స్వాగతం పలుకుతూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్‌ఈ వేణుమాధవ్, డీఆర్‌ఓ పీడీ రాంరెడ్డి, డీఈఓ రాము, డీఈ శ్రీధర్, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, గ్రామ అధ్యక్షుడు కర్నాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిఫ్రిజిరేటర్ క్లీనింగ్ చేస్తుండగా...

విద్యుదాఘాతంతో ఎంపీటీసీ మృతి

- కొండాయిలో అలుముకున్న విషాదఛాయలు



ధనలక్ష్మి(ఫైల్)

ఏటూరునాగారం : రిఫ్రిజిరేటర్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఎంపీటీసీ మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్లెల ధనలక్ష్మి (40) ఇంటిలో రిఫ్రిజిరేటర్‌ను శుభ్రం చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఇంట్లో భర్త, పిల్లలు లేకపోవడంతో ఎవరూ కూడా అంతగా గమనించలేదు. ధనలక్ష్మి 2019లో జరిగిన ఎన్నికల్లో కొండాయి ఎంపీటీసీగా బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందింది. భర్త మూర్తి తన బంధువుకు అనారోగ్య సమస్య ఉంటే చెన్నైకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో విద్యుత్ షాక్ కొట్టిన తర్వాత చాలా సమయానికి ఇరుగు పొరుగు, కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లిన వ్యక్తి రావడం లేదని వెళ్లి చూసేసరికి అప్పటికే ఆమె కిందపడిపోయి ఉంది. గమనించిన వారు ధనలక్ష్మిని తాకడంతో వారికి కూడా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి చూసే వరకు అప్పటికే మృతి చెంది ఉంది.

అమ్మా లే అమ్మా అంటూ..

అమ్మా లే అమ్మా అంటూ తన కుమార్తెలు దీపిక, మైత్రిక బోరున విలపిస్తూ తెలిపారు. అప్పటి వరకు ఫ్రిజ్‌ను క్లీన్ చేసిన అమ్మ వెళ్లి మళ్లీ రాకపోవడంతో వెళ్లి చూసే వరకు అక్కడ పడిపోయి ఉంది. చదువుకుంటున్న తమకు దిక్కెవరని కన్నీరు మున్నీరుగా విలపించారు.

2019 జూన్ 7 ప్రమాణస్వీకారం... జూన్ 5న మృతి

2019 సంవత్సరంలో కొండాయి ఎంపీటీసీగా మల్లెల ధనలక్ష్మి బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందింది. 2019 జూన్ 7న ఆమె ఎంపీటీసీగా ప్రమాణస్వీకారం చేయగా 2023 జూన్ 5న మృతి చెందడం బాధాకరం. ప్రజాక్షేత్రంలో ఉంటూ నిత్యం సమస్యలను పరిష్కరించే విధంగా భార్య ధనలక్ష్మి, భర్త మూర్తిలు కృషి చేసేవారు.

నియంతృత్వాన్ని పెంచుతున్న బీజేపీ

- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్



ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

నర్సంపేట: ప్రజాప్రత్యామ్నాయం లేక బీజేపీ నియంతృత్వాన్ని పెంచుతుందని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్ అన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశం రెండోరోజు పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ప్లీనరీ ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజాఉద్యమంలో మృతి చెందిన వారికి, ఒడిశా రైలు ప్రమాద మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో అమెరికా నాయకత్వంలో నాటో కూటమి ఆయుధ ఉత్పత్తుల అమ్మకాలను చేస్తూ వనరుల సమీకరణకు చేసిన కుట్రలో భాగంగా ఉక్రెయిన్‌ను తమ గుప్పిట్లో పెట్టుకొని రష్యాపై కుయుక్తులు చేస్తూ దిగువన యుద్ధం చర్యలు వల్ల ప్రపంచ ప్రజలు అనేక నష్టాలు చవి చూస్తున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అంతర్జాతీయ, జాతీయ నిర్మాణ కార్యదర్శి నివేదికను ప్లీనరీలో ప్రవేశపెట్టారు. సమావేశంలో ఏపీ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, వస్కుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, ఎస్‌కె.నజీర్, వి.తుకారాంనాయక్, కన్నం వెంకన్న, కర్ర రాజిరెడ్డి, నీల రవీందర్, వంగల రాగసుధ, జబ్బర్‌నాయక్, కర్రోళ్ల శ్రీనివాస్, మల్లేష్, నగెల్లి కొమురయ్య, మైదం శెట్టి రమేష్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యం చేసేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కేకే రేమా

నర్సంపేట: దోపిడీ రహిత సమాజ స్థాపన కోసం కమ్యూనిస్టులను ఐక్యం చేసేందుకు ఎంసీపీఐ (యూ) కృషి చేయాలని కేరళ ప్యానల్ స్పీకర్ కేకే రేమా అన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించగా సోమవారం సాయంత్రం ఆమె మాట్లాడారు. కష్టజీవుల పక్షాన ఉండాల్సిన సీపీఎం, సీపీఐ పార్టీలు ప్రజా పోరాటాలు నిర్వహిస్తూనే ఎన్నికల సమయంలో అవకాశవాద రాజకీయాలకు పాల్పడడం కమ్యూనిస్టుల ఐక్యతకు విఘాతం కలిగిస్తుందన్నారు. సమరశీల పోరాటాల ద్వారానే పాలకుల దోపిడీ విధానాలకు అడ్డుకట్ట వేయగలుతామన్నారు.

బొడ్రాయి సామగ్రి కోసమని వెళ్లి..


- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు
- భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



కుమారస్వామి (ఫైల్)

నర్సంపేట రూరల్ : జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే భర్త మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం ముత్తోజీపేట శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని మేడపల్లికి చెందిన తోట కుమారస్వామి (48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8 నుంచి మేడపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన, శ్రీరామాలయం, పోచమ్మగుడి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సామగ్రి కొనుగోలు కోసం కుమారస్వామి, తన భార్య రామనీలతో కలిసి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు వచ్చాడు. సామగ్రి కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా ముత్తోజీపేట శివారులో 365 జాతీయ రహదారిపై ట్రాక్టర్ నిలిచింది. ఒక్కసారిగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో కుమారస్వామి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. కుమారస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కేయూలో బీఈడీ విద్యార్థినుల ఆవేదన



ఆరుబయట ఆవేదనతో కూర్చున్న బీఈడీ విద్యార్థినులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో మహిళా హాస్టల్‌లో తాము ఉండే గదిని లాక్ చేసి తమను సంబంధిత అధికారిణి బయటికి వెళ్లగొట్టారని పలువురు బీఈడీ విద్యార్థినులు సోమవారం రాత్రి తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అనుకూలంగా ఉండే హాస్టల్‌లోని ఓ గదిలో తాము ఉంటుండగా ఆ గదిలో ఉండవద్దంటూ ఆ గదికి తాళం వేశారని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. తమకు రెండు నెలలు అయితే కోర్సు పూర్తవుతుందని తమకు సౌకర్యవంతంగా ఉండే గదిలో ఉంటున్నామన్నారు. కానీ అందులో ఉండవద్దంటూ ఆ గదికి తాళం వేశారన్నారు. రాత్రి 10.30 గంటల వరకు కూడా క్యాంపస్‌లో ఆరుబయటే ఉన్నారు. వీరికి పలువురు (బాయ్స్) మద్దతు తెలిపారు. ఈ విషయంపై మహిళా జాయింట్ డైరెక్టర్ సుచరిత పాల్‌ను 'సాక్షి' వివరణ కోరగా బీఈడీ విద్యార్థినులకు గతంలో క్యాంపస్‌లో ఓ క్వార్టర్‌లో వసతిగా ఉండేవారన్నారు. అయితే ఇటీవల న్యాక్ టీం వచ్చే ముందు ఈ బీఈడి విద్యార్థినులకు మహిళా హాస్టల్‌లోని సీ బ్లాక్‌ను కేటాయించామన్నారు. అయితే మహిళా హాస్టల్ 'ఇ' బ్లాక్‌లో ఉండే వేరే కోర్సు విద్యార్థినుల పరీక్షలు పూర్తవడంతో 'ఇ' బ్లాక్‌లోని ఓ గదిని లాక్ చేశామని తెలిపారు. అయితే అందులో బీఈడీ విద్యార్థినులు కూడా ఉంటున్నారని తెలిసిందని వారికి కేటాయించిన సీ బ్లాక్‌లోని గదిలోనే ఉండాలని చెప్పామన్నారు. వారిని వెళ్లగొట్టలేదని సుచరిత పాల్ వివరణ ఇచ్చారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

- ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి
- పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

విద్యారణ్యపురి: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలో టెన్త్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు, 10/10 జీపీఏ సాధించిన వారికి, వందశాతం ఉత్తీర్ణులు సాధించిన హైస్కూళ్ల హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హనుమకొండలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. వృత్తిపరంగా ఉపాధ్యాయులు త మ విధులకు పునరంకితం కావాలని పిలుపునిచ్చా రు. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ నెలా ఖరులో నిర్వహించే అవకాశాలున్నాయని వెల్లడించారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ పభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు తోడ్పడాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ సంఘం పని చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీ ఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, డీఈఓ ఎం డీ.అబ్దుల్‌హై, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీని వాస్, ఎంఈఓలు రాంకిషన్‌రాజు, వెంకటేశ్వర్లు,రమాదేవి, రవీందర్, మాజీ పీఆర్‌టీయూ అధ్యక్షుడు బాలిని రామయ్య, పీజీ హెచ్‌ఎం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, పీఆర్‌టీయూ నాయకులు ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వరంగల్ అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ పట్టాభి, అనురాధ, కరీంనగర్ జిల్లాప్రధాన కార్యదర్శి జయాల్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి యాదవరె డ్డి, జిల్లాసైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, ఉపేందర్‌రెడ్డి, భానుప్రసాద్‌రెడ్డి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

- ఏఆర్‌ఎస్ ఏడీ డాక్టర్ ఉమారెడ్డి

కరీమాబాద్: మారుతున్న కాలానికనుగుణంగా రైతులు కూడా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. వరంగల్ ఏఆర్‌ఎస్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు కొత్త టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకుగాను ఈ నెల 9, 10, 11వ తేదీలలో టీఎస్ అగ్రిటెక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక, సాంకేతిక పనిముట్లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటి గురించి ఆయా కంపెనీల వారు రైతులకు వివరిస్తారన్నారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉమారెడ్డి కోరారు. సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ మచ్చ దినేశ్ పాల్గొన్నారు.

అత్తింటికి నిప్పుపెట్టిన అల్లుడు

- నిందితుడికి ఐదేళ్ల జైలు, జరిమానా

వరంగల్ లీగల్ : పిల్లనిచ్చిన అత్తమామల మీద కోపంతో వారి ఇంటికి నిప్పంటించిన అల్లుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మండ వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన అనూషకు లింగాల సంతోష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. సంతోష్ తన అత్తగారి ఊరైన తిమ్మాపురం వలసవచ్చి అక్కడే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడని తెలిపారు. భార్య, పిల్లలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భార్య అనూష తన ఇద్దరు పిల్లలతో సహా తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అక్కడే నివాసం ఉండేదని తెలిపారు. తనమాట భార్య వినడం లేదన్న కోపంతో భార్యను, పిల్లలను, అత్తమామలను అందరినీ ఒకేసారి చంపాలన్న కోపంతో నిందితుడు పథకం ప్రకారం ఫిబ్రవరి 12, 2021న రాత్రి వేళలో తిమ్మాపురంలోని తన అత్తమామల ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ఎదురుగా ఉన్న గడ్డివాములో నుంచి కొంత గడ్డి తీసి ఇంటికి అన్ని వైపులా వేసి నిప్పంటించాడు. అప్పుడే మూత్రవిసర్జనకు వచ్చిన చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేయడంతో సంతోష్ అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు మంట లపై నీళ్లు పోసి ఆర్పడంతో ఇంట్లో ఉన్న అతడి భా ర్య, పిల్లలు, అత్తమామలు ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే వారు సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన అప్పటి ఎస్సై సురేష్ కేసును దర్యాప్తు చేసి నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి వెంకటేశ్వరరావు నేరం రుజువుకావడంతో సంతోష్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసును పీపీ షేక్ అబ్దుల్ నబీ వాదించగా, లైజన్ ఆఫీసర్ ఎం.వెంకటస్వామి, కోర్టు కానిస్టేబుల్ సీహెచ్. రాజులు సాక్షులను కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు.